

మ్యాథమెటిక్స్ పరీక్షకు 370 మంది గైర్హాజరు

వికారాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం జరిగిన పదో తరగతి మ్యాథమెటిక్స్ సప్లిమెంటరీ పరీక్షకు 3,712 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 25 పరీక్షా కేంద్రాల్లో 4,082 మంది విద్యార్థులను కేటాయించగా, వారిలో 3,712 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 370మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు 90.93 శాతం విద్యార్థులు హాజరయ్యారు.



ఆశల సాగు!

ఈ సారి వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే రుతుపవనాలు జిల్లాను తాకాయి. తొలకరి వర్షాలు పడుతున్నాయి. వానాకాలం సాగు షురూ అయింది. శనివారం మృగశిర కార్తె ప్రారంభంతో సాగు పనులు ఊపందుకోనున్నాయి. ఈ క్రమంలో రైతన్నలు ఓ వైపు పొలాలను సిద్ధం చేసుకుంటూనే, మరో వైపు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే పనిలో బిజీగా ఉన్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం జూన్‌లోనే రైతుబంధు కింద రైతుల ఖాతాల్లోనే పెట్టుబడి సాయం జమ చేసింది. ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా కింద రైతులకు పెట్టుబడి సాయం వచ్చేనెలలో అందజేస్తామని ఇటీవలే మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. అయితే ఈనెల మొదటి వారంలోనే ఖాతాల్లో జమ చేస్తే పెట్టుబడులకు ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు. ఆలస్యం జరిగితే మళ్లీ వడ్డీవ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందని, అప్పుల ఊబిలో కూరుకుపోక తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- నేడు మృగశిర కార్తె..
- ఊపందుకోనున్న సాగు పనులు
- జిల్లాలో పత్తి, కంది, మొక్కజొన్న రికార్డు స్థాయిలో సాగయ్యే అవకాశం
- ముందస్తు ప్రణాళికలు చేసినా తప్పని విత్తన కష్టం!
- జిల్లాకు 5,42,400 పత్తి విత్తనాల ప్యాకెట్లు అవసరం
- అందుబాటులో ఉన్న ప్యాకెట్లు 3.14 లక్షలు మాత్రమే
- మొక్కజొన్న సాగుకు 4,036 క్వింటాళ్ల విత్తనాలు అవసరం
- అందుబాటులో 200 క్వింటాళ్లు మాత్రమే
- పెట్టుబడులపై అన్నదాతల్లో గుబులు

వానాకాలం సాగు కోలాహలం

పరిగి, జూన్ 7: వర్షాకాలం వచ్చేసింది. సాగు పనులకు రైతులు రెడీ అవుతున్నారు. జిల్లాలో ఆడపాదడపా కురుస్తున్న తొలకరి వర్షాలతో రైతుల ఆశలు తొంగి చూస్తున్నాయి. పొలాల్లో, మార్కెట్‌లలో రైతన్నల సందడి నెలకొంది. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లతో జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, మర్పల్లి, మోమిన్‌పేట్ ప్రాంతాల్లో ఎరువుల దుకాణాలు సందడిగా మారాయి. వానాకాలం సీజన్ ప్రారంభంతో ఒక వైపు పొలాల్లో పనులు సాగిస్తూనే, మరో వైపు రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులకోసం పట్టణాలు, మండల కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఈసారి పత్తి, మొక్కజొన్న పంటలను ఎక్కువగా సాగు చేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. గతంలో రైతులకు కావాల్సిన ఎరువులు సకాలంలో దొరకకపోవడంతో ఈసారి ముందుగానే వారికి కావాల్సిన ఎరువులను ఎక్కువ ధరలకైనా సరే కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ చేసుకుంటున్నారు. జిల్లాలో వివిధ రకాల పంటలు కలిపి మొత్తం 5,97,830 ఎకరాల్లో సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. గతేడాది వానాకాలంలో సాగు చేసిన పత్తి, కంది, మొక్కజొన్న పంటల విస్తీర్ణం ఈసారి పెరగనుంది. గత ఏడాది వానాకాలంలో పత్తి పంట 2,50,099 ఎకరాల్లో సాగుచేయగా, ఈసారి 2,63,500 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. కంది గతేడాది 1,04,448 ఎకరాల్లో సాగవగా, ఈసారి 1.50లక్షల ఎకరాలకు సాగు పెరిగే అవకాశం ఉంది. గతేడాది 38,082 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా, ఈ సారి 50,450 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వరి సాగు గతేడాది 1,33,992 ఎకరాల్లో సాగు చేయగా, ఈ సారి 1,10,000 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉంది. అదే జొన్న పంట గత ఏడాది 1116 ఎకరాల్లో పండించగా, ఈసారి 2,504 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. మినుములు గత ఏడాది5,184 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి 5వేల ఎకరాల్లో సాగు చేయవచ్చని అంచనా వేశారు. పెసర పంట గత ఏడాది 12,839 ఎకరాల్లో సాగు చేయగా, ఈఏడాది 13,500 ఎకరాల్లో సాగు కావచ్చని భావిస్తున్నారు.

కంది, మొక్కజొన్న సాగుపై దృష్టి

జిల్లాలో ఈసారి కంది, మొక్కజొన్న కూడా ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే పరిస్థితి కనిపిస్తున్నది. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీతో పాటు ధర అధికంగా ఉండడంతో మొక్కజొన్న సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వానాకాలం సీజన్ ఆరంభంలోనే వర్షాలు కురియడంతో పత్తి, కంది సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.

పత్తి వైపు రైతు చూపు

జిల్లాలో ఏటేటా పత్తి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. జిల్లాలో గతేడాది 2.5 లక్షల ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి 2.63 లక్షల ఎకరాల్లో సాగు చేయనున్నారు. గతేడాది పత్తి దిగుబడులు, ధరలు ఆశించిన విధంగా ఉండడంతో రైతులు దానివైపే మొగ్గు చూపుతున్నారు. పత్తి ఆరుతడి పంట కావడం, వర్షాలు అనిశ్చితి కారణంగా దిగుబడి రాకపోయినా పెట్టుబడి వస్తుందనే ఉద్దేశంతో రైతులు పత్తి సాగుపై మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తున్నది. సాగునీటి సౌకర్యాలు ఉన్న చోట వరికి ప్రాధాన్యం ఇస్తున్నారు. బీటీ పత్తి విత్తనాలు వచ్చాక తెగుళ్లు తగ్గి పంట దిగుబడులు పెరిగాయి. దీంతో రైతులు పత్తి పంటసాగు చేసేందుకు ఆసక్తిని చూపుతున్నారు.

అందుబాటులో విత్తనాలు అంతంతే..

అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. పెరిగిన విత్తనాల ధరలతో కొనుగోలు భారం కానుంది. జూన్ మొదటివారంలో విత్తనాలు విత్తే సమయం. ఆ సమయం రానే వచ్చేసింది. ఈసారి 5,42,400 ప్యాకెట్లు అవసరం ఉండగా, అందుబాటులో 3.14 లక్షలు ప్యాకెట్లు, మొక్కజొన్నలు 4,036 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉండగా, ప్రస్తుతం 200 క్వింటాళ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కందులు 4,500 క్వింటాళ్లు, మినుములు 400 క్వింటాళ్లు, పెసర్లు 1,040 క్వింటాళ్లు, 27,500 క్వింటాళ్ల వరివిత్తనాల అవసరం ఉంది. అయితే ఈ విత్తనాలు ఇప్పటి వరకూ అందుబాటులో లేవు. అధికారుల ప్రకటనలకు, వాస్తవ పరిస్థితులకు ఆమడదూరం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పొలం దున్నుతున్న రైతు

రైతు భరోసా పై గంపెడాశలు..

యాసంగిలో కరువుతో పంటలన్నీ ఎండిపోవడంతో వానకాలం పెట్టుబడులకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతబీఆర్ఎస్ ప్రభుత్వం జూన్‌లోనే రైతుబంధు కింద రైతుల ఖాతాల్లోనే పెట్టుబడి సాయం జమ చేసేది. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం జులైలో రైతుభరోసా కింద రైతులకు పెట్టుబడి సహాయం అందజేస్తామని ఇటీవలే మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. సీజన్ ప్రారంభంలో రైతు భరోసా ఇస్తే పెట్టుబడులకు ఆసరా అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఆలస్యం జరిగితే మళ్లీ వడ్డీవ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.7500ల చొప్పున రెండు సీజన్లకు రూ.15వేల రైతు భరోసా సాయంపై రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. రైతు భరోసా సకాలంలో ఖాతాల్లో జమ చేస్తే కాస్త ఉపశమనం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. పంట రుణాలు ఇవ్వడంతో పాటు, జూన్ మాసంలోనే రైతుభరోసా డబ్బులు ఇస్తే పెట్టుబడులకు ఉపయోగపడనుంది.

రాయితీపై విత్తనాలు ఇవ్వాలి



వానాకాలం పంటల సాగు కోసం పొలాలను సిద్ధం చేశాం. అయితే ప్రభుత్వ పరంగా కానీ, మార్కెట్‌లోగానీ విత్తనాలు అందుబాటులో లేవు. అన్ని రకాల విత్తనాలను ప్రభుత్వం రాయితీపై సరఫరా చేయాలి. రైతు భరోసా కూడా ఈ వారంలోనే జమ చేస్తే పెట్టుబడులకు ఉపయోగపడుతుంది. ఆలస్యం జరిగితే మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుంది. అధికారులు సకాలంలో చర్యలు చేపట్టి చేయూతనందిస్తే రైతులకు లాభం జరుగుతుంది.

- అంజనేయులు, రైతు, పరిగి

వానాకాలం పంటల సాగుకు సిద్ధం




జిల్లాలో వానాకాలం పంటల సాగుకు అన్ని విధాలుగా చర్యలు చేపట్టాం. జిల్లాలో వివిధ రకాల పంటలు కలిపి 5,97,830 ఎకరాల్లో సాగు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశాం. అందుకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాం. ఈ సారి పంటలు సాగుకు పరిస్థితులు అనువుగా ఉన్నాయి.

- గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి

బాలాజీ ఆలయం మూసివేతపై తప్పుడు ప్రకటన

- శని, ఆదివారాల్లో దర్శనం ఉండదని గూగుల్‌లో పోస్టు
- గుర్తుతెలియని దుండగుల నిర్వాకం.. ఆలయ నిర్వాహకుల ఆగ్రహం
- తోసిపుచ్చిన ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్

మొయినాబాద్ రూరల్, జూన్ 7: సెర్చ్ ఇంజిన్ గూగుల్‌లో చిలుకూరు బాలాజీ ఆలయానికి సంబంధించి శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు ఓ పోస్టు(ప్రకటన) పెట్టారు. అందులో ఇకనుంచి శని, ఆదివారాల్లో ఆలయాన్ని మూసివేస్తున్నారని, మిగతా రోజుల్లో ఆలయం తెరుచుకుని ఉంటుందని, దర్శన వేళల సమయాలను కూడా ప్రకటనలో పేర్కొనడం భక్తులను అయోమయానికి గురిచేసింది. దాంతో కొందరు ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ దృష్టికి విషయం తీసుకురాగా.. ఆయన శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ చిలుకూరు బాలాజీ ఆలయ దర్శన వేళలు, ఆలయం మూసివేత, తెరిచి ఉండడంపై వివరాలు తాము వెల్లడిస్తామని, గూగుల్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. తాము ఎలాంటి ప్రకటనలు చేయకుండా సోషల్ మీడియాలో వివరాలు పెట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శని, ఆదివారాల్లో చిలుకూరుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుంటారని, ఆలయం ప్రతిష్ఠతను కొందరు దెబ్బతీయాలని చూస్తున్నారని అన్నారు. కలియువ దైవం చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రతిష్ఠతను కొందరు దుర్మార్గులు దెబ్బతీయాలని చూస్తున్నారని, అలాంటి వారికి వేంకటేశ్వరస్వామి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని రంగరాజన్ మండిపడ్డారు. గూగుల్‌లో పెట్టిన వివరాలు అబద్ధమని, ప్రజలు నమ్మవద్దని ఈ విషయంలో కఠినంగా వ్యవహరించి సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు, అర్చకుడు రంగరాజన్ చెప్పారు.



దర్శన వేళల గురించి గూగుల్‌లో చేసిన పోస్టు

స్కూల్ యూనిఫామ్‌లు సకాలంలో అందించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్7 : స్కూల్ యూనిఫామ్‌లను విద్యార్థులకు సకాలంలో అందించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులచే కుట్టించిన స్కూల్ యూనిఫామ్ (ఏకరూప దుస్తులు)లను జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులకు కలెక్టర్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లను మహిళా సంఘాలు మంచి నాణ్యత, డిజైన్‌తో తయారు చేశారన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులను కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లను సకాలంలో అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈనెల 10 వ తేదీలోపు యూనిఫామ్‌లు పాఠశాలలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, అడిషనల్ డీఆర్డీవో సరోజ, డీపీఎంలు రాంమూర్తి, నర్సింహులుతదితరులు పాల్గొన్నారు.



స్కూల్ యూనిఫామ్‌లను చూపిస్తున్న నారాయణరెడ్డి

ఇక పాలనపై దృష్టి

- ముగిసిన ఎన్నికల కోడ్
- సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారుల శ్రద్ధ
- వేగవంతం కానున్న పనులు
- ప్రత్యేక ప్రణాళికతోనే పేరుకున్న సమస్యల పరిష్కారం

ఆంధ్రజ్యోతి, మేడ్చల్ /వికారాబాద్ /తాండూరు, జూన్ 6 : కొన్ని నెలలుగా కొనసాగిన ఎన్నికల కోడ్ ముగిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సుదీర్ఘంగా 81రోజుల పాటు కోడ్ అమల్లో ఉంది. గత బుధవారం సాయంత్రం నుంచి ఎన్నికల కోడ్ ముగిసినట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. రెండున్నర నెలలకుపైగా స్తంభించిన సాధారణ పాలన పట్టాలెక్కింది. ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికార యంత్రాగం వారి విధుల్లో చేరారు. రెవెన్యూ పురపాలక, పోలీసు శాఖల్లో పనులు స్తంభించాయి. కోడ్ ఉన్న సమయాల్లో అత్యవసరమైతే తప్ప ఇతర పనులు చేయలేని పరిస్థితి ఉండేది. లోక్‌సభ ఎన్నికలకు మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి జూన్ 4న ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంది. ఇప్పుడది తొలగిపోవడంతో ఎమ్మెల్యేలు, అధికారులు సాధారణ పాలన కొనసాగించనున్నారు. ఎప్పటిలాగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టిపెట్టనున్నారు. గతంలో అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి ఎమ్మెల్యేకు రూ.10కోట్ల చొప్పున కేటాయించారు. ఇందులో రూ.కోటి తాగునీటి ఎద్దడి నివారణకు వెచ్చించాలని మార్చిలోనే అధికారులను ఆదేశించారు. మిగిలిన నిధులను ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పనులకు వినియోగించాల్సి ఉంది. కాగా మార్చి 16న ఎన్నికల కోడ్ రావడంతో ఈ పనులు నిలిచాయి. ఇకపై ఈ పనులపై ఎక్కువ దృష్టిసారించే అవకాశం ఉంది.



పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న అధికారులు

ప్రజావాణి మళ్లా షురూ!

కలెక్టర్లు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జూన్ 4 వరకు నిలిపేశారు. వివిధ సమస్యలను ప్రజలు నేరుగా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు విన్నవించే వారు. ఎన్నికల కోడ్‌తో సమస్యలు పేరుకుపోయాయి. జూన్‌లోనే సాగు ప్రణాళిక, వసతుల కల్పన, రోడ్లు, ప్రజారోగ్యం తదితర కీలకాంశాలపై అధికారులు, ఎమ్మెల్యేలు సమీక్ష సమావేశాలు నిర్వహించేవారు. కోడ్‌తో వాటికి బ్రేక్ పడినా ఇకపై ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోనున్నారు. ప్రజావాణి వచ్చే సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. దీంతో వివిధ శాఖల అధికారులు అందుబాటులోకి రానున్నారు.

స్థానిక సంస్థలకు నిలిచిన నిధులు

పంచాయతీలు, మున్సిపాలిటీలకు నిధులు నిలిచాయి. ఇందుకు సమగ్ర ప్రణాలిక తయారు చేయాల్సి ఉంది. ఎన్నికల కోడ్‌తో నిలిచిన పనులు ఇప్పుడు కొనసాగే అవకాశాలున్నాయి. పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పర్యవేక్షిస్తున్నారు. అధికారులు సైతం మూడు నెలలుగా ఎన్నికల విధుల్లోనే ఉండటంతో పనులు నిలిచాయి. పారిశుధ్య పనులు, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, డ్రెయిన్లు, రహదారి నిర్మాణాలకు నిధులు కేటాయించి పనులు ఉధృతంగా చేయించాల్సి ఉంది.

నత్తనడకన 'అమ్మ ఆదర్శ' పాఠశాలల పనులు

జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానుండగా ప్రభుత్వ బడుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కాలేదు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతునన్న పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. జూన్ 10లోగా పనులు పూర్తిచేయాలని సీఎస్ శాంతికుమారి కలెక్టర్‌లకు ఆదేశాలిచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలకు, పనులు పూర్తయిన పాఠశాలలకు రంగులువేయలని, పనులు మొదలుపెట్టని చోట్ల వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. అధికారులు చొరవ చూపితే జూన్ 12లోగా 50శాతం పనులు పూర్తియ్యే అవకాశం ఉంది.

పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారం

ధరణి పోర్టల్‌లో సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎన్నికలకు ముందు స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. కోడ్‌తో దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ ముందుకు సాగలేదు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లోనే లీనం కావడంతో ప్రక్రియ దరఖాస్తుల స్థాయిలోనే నిలిచింది. ప్రభుత్వం ప్రస్తుతం ధరణిలోని పలు నిబంధనలను సవరిస్తోంది. జీఎల్ఎం ద్వారా వచ్చిన దరఖాస్తులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగితేనే పెండింగ్ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

అంతా అయిపోయాక.. బడిబాట పట్టేవారేరి!

ఇప్పటికే ప్రైవేటు బాట పట్టిన పిల్లలు

- తాపీగా విద్యాశాఖ బడిబాట ప్రారంభం
- అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

మేడ్చల్ జూన్ 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఆకులు రాలాక.... చేతులు పట్టుకున్నట్లుగా ఉంది విద్యాశాఖ అధికారుల తీరు. విద్యార్థులంతా ప్రైవేటు బాట పట్టిన తర్వాత తాపీగా విద్యాశాఖ అధికారులు బడిబాట పట్టడం వల్ల ఉపయోగం ఏమిటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెల రోజులుగా మండు టెండలో సైతం ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, యాజమాన్యాలు ఇంటింటి ప్రచారం చేస్తూ వారి పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు, వసతులు, ఉపాధ్యాయుల సీనియార్టీ, సాధించిన ఫలితాలు, కరపత్రాలతో విస్తృతంగా ప్రచారం నిర్వహించి అడ్మిషన్లు సాధించారు. ఒకటికి నాలుగు సార్లు తల్లిదండ్రులకు ఫోన్లు చేసి పిల్లలను చేర్పించేంత వరకు వదిలిపెట్టలేదు. దూర ప్రాంతాల నుంచి రావడానికి రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. కొత్తగా కంప్యూటర్ విద్య ప్రవేశపెడుతున్నారు. చాలా మంది తల్లిదండ్రులు ఇప్పటికే అటు వైపు మొగ్గు చూపారు. స్థానిక ప్రైవేటు పాఠశాలలతో పాటు కార్పొరేట్ పాఠశాలలు చేరవయ్యాయి. మూడేళ్లు నిండిన చిన్నారులను ఎల్‌కేజీ, యూకేజీలలో చేర్పిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చక్కబెట్టుకున్న తర్వాత ప్రస్తుతం విద్యాశాఖ వారు బడిబాట ప్రారంభించారు. బడిబాట కార్యక్రమం పెట్టినా గత ఐదారు సంవత్సరాలుగా పిల్లలను చేర్పించింది నామమాత్రమే.



మూడుచింతలపల్లిలో బడిబాట ర్యాలీ (ఫైల్)

బడిబాట కార్యక్రమాలు...

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట మొదలు పెట్టిన రోజు గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మహిళా సంఘ సభ్యులు సమావేశమై కార్యక్రమంపై చర్చించి పిల్లలను బడిలో చేర్పిస్తామని ప్రతిజ్ఞ చేయాలి. ర్యాలీ నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలి. రెండో రోజు ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కలిసి బడీడు పిల్లలు ఉంటే బడిలో చేర్పించాలని ఒప్పించి చేర్పించాలి. పిల్లలను గుర్తించి రికార్డులో పొందుపర్చాలి. తర్వాత 8,9 తేదీల్లో ఇంటింటి ప్రచారంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బడికి వెళ్లే వారిని గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ బడిలో చేర్పించేలా ఒప్పించాలి. కరపత్రాలు, బ్రోచర్లు తయారు చేసి ప్రభుత్వ బడిలో చేరితే ప్రయోజనాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, వసతులు, ఏకరూప దుస్తులు , పుస్తకాలు, మధ్యాహ్న భోజనం తదితర వసతులు, సౌకర్యాలను వివరించాలి. 11న గ్రామ సభ నిర్వహించి బడిబాటలో చేసిన కార్యక్రమాలు, బడి బయట ఉన్న వారి వివరాలు, డ్రాప్ అవుట్‌ల గురించి వివరించాలి. 11లోగా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి 12న బడి ప్రారంభోత్సవం సందర్భంగా అలంకరణతో స్వాగతం పలకాలి.

గ్రూప్ 1 పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరగాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, జూన్ 7: గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జూన్ 9వ తేదీన నిర్వహించే గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి చేపట్టాల్సిన విధివిధానాలపై ఐడెంటిఫికేషన్ అధికారులు, శాఖాపరమైన అధికారులు, పరీక్ష నిర్వహణ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. జిల్లాలో గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలో ఎలాంటి తప్పిదాలకు తావునీయకుండా అతిజాగ్రత్తగా పరీక్ష నిర్వహించాలన్నారు. పరీక్ష విధులు నిర్వహించే అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రూట్ అధికారులు తమ లొకేషన్లను ముందస్తుగానే చూసుకోవాలని, శాఖ అధికారులు పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో వెళ్లి పర్యవేక్షించాలని సూచించారు. ఐడెంటిఫికేషన్ అధికారులు అభ్యర్థి హాల్‌టికెట్, ఫొటోను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకొని ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. పూర్తి పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌తో పాటు టీజీపీఎస్సీ రీజనల్ కోఆర్డినేటర్ రాజేష్ ఉన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మేడ్చల్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్ అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్యాలు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో 105 కేంద్రాల్లో 69,727 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. 105 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్, జాయింట్ కస్టోడియన్ ఆఫీసర్స్ 7, స్ట్రాంగ్ రూమ్స్ 7, రూట్స్ 18, రూటు ఆఫీసర్స్ 18 మంది, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 22 మంది, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్స్ 276మంది, అబ్జర్వర్స్ 105 మందిని నియమించినట్లు తెలిపారు. జూన్ 9వ తేదీన ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ పరీక్ష ఉంటుందన్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో ఎలాంటి తప్పిదాలకు తావీయకుండా జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో 144సెక్షన్ అమలు చేయాలని, అభ్యర్థులను విడివిడిగా తనిఖీ చేయాలన్నారు. ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు అనుమతి ఉంటుందని, నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్‌లో ఏర్పాట్లు పూర్తి

ఘట్‌కేసర్ రూరల్: ఈ నెల 9న జరిగే గ్రూప్-1 పరీక్షలకు సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఘట్‌కేసర్ తహసీల్దారు డీఎస్ రజిని తెలిపారు. ఆమె శుక్రవారం మాట్లాడుతూ.. ఘట్‌కేసర్ మండలంలోని 13కేంద్రాల్లో గ్రూప్-1 పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 13 కేంద్రాల్లో 9,878 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. కొండాపూర్‌లోని విజ్ఞాన మహిళా ఇంజనీరింగ్ కళాశాల, అవుశాపూర్‌లోని అరోరా, విజ్ఞానభారతి ఇంజనీరింగ్ కళాశాలలు, ఎదులాబాద్‌లోని మెగా ఇంజనీరింగ్ కళాశాల, అంకుశాపూర్‌లోని ఏస్ ఇంజనీరింగ్ కళాశాల, వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలోని రెండు కేంద్రాలు, కొర్రెములలోని సిద్ధార్థ కళాశాల, చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



'అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్' శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి



వెనుకబడిన కులాల అభివృద్ధి అధికారి ఉపేందర్

వికారాబాద్, జూన్ 7: అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్ శిక్షణ పొందడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వెనుకబడిన కులాల అభివృద్ధి అధికారి కె.ఉపేందర్ తెలిపారు. 2024-25 సంవత్సరం అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్ శిక్షణ పొందడానికి జిల్లాకు చెందిన గ్రాడ్యుయేట్ పూర్తి చేసుకుని బీసీ కులాలకు చెందిన అభ్యర్థులు జూన్ 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారిలో నలుగురు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు రాష్ట్ర చట్టం కింద స్థాపించడిన విశ్వవిద్యాలయం లేదా కేంద్ర విద్యాలయం గ్రాంట్స్ కమిషన్ గుర్తించి విద్యాసంస్థల నుంచి లా డిగ్రీ పొంది ఉండాలని సూచించారు. అభ్యర్థి వయసు జూలై 22 నాటికి 23 సంవత్సరాల నుంచి 35సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థి తల్లిదండ్రుల, సంరక్షకుల ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి రూ.లక్షా 50వేలు, పట్టణ ప్రాంతం వారికి రూ.2లక్షలకు మించి ఉండరాదన్నారు. అభ్యర్థులుగతంలో ఇలాంటి సౌకర్యాన్ని వినియోగించుకొని ఉండరాదని, బార్ కౌన్సిల్ తమ పేరు నమోదు చేసుకుని ఉండాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు మూడేళ్ల అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్‌లో శిక్షణ పొందాలన్నారు. ఈ మూడేళ్ల ఆర్థిక సాయం అందించబడుతుందని తెలిపారు. శిక్షణా కాలంలో రూ.వెయ్యి చొప్పున ఉపకార వేతనం చెల్లించబడుతుందని తెలిపారు. అడ్వకేట్‌గా నమోదు చేసుకునేందుకు రూ.55 రుసుము చెల్లించబడుతుందని తెలిపారు. పుస్తకాలు, ఫర్నీచర్ కొనుగోలుకు రూ.3వేలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు శిక్షణకు జిల్లా న్యాయస్థానంలోని ప్రభుత్వ న్యాయాధికారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు అనుబంధం చేయబడుతుందని తెలిపారు. జూన్ 10 నుంచి జిల్లా వెనుకబడిన కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలోదరఖాస్తులు పొందవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పాస్‌పోర్ట్ సైజ్‌లో ఆధార్, స్థానిక కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, లాడిగ్రీ ప్రొవిజినల్‌తో పాటు కౌన్సిల్ కన్సాలిడేట్ ధ్రువీకరణ పత్రాలతో జూన్ 5వ తేదీలోగా వికారాబాద్ కలెక్టరేట్‌లోని వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


బషీరాబాద్, జూన్ 7: 'గిరిజనులకు తాగు నీటి కష్టాలు' అనే శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాగం కదిలింది. మండలంలోని మాసన్‌పల్లి పంచాయతీ అనుబంధ గ్రామమైన తౌర్యానాయక్ తండాను డీఎల్‌పీవో శంకర్ నాయక్, బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు, మిషన్ భగీరథ డీఈ, పంచాయతీ కార్యదర్శి తండాను సందర్శించారు. చేతిపంపులు, పైపులైన్ల మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. యుద్ధ ప్రతిపాదికన చేతి పంపుల మరమ్మతులను చేపట్టారు. తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో శంకర్ నాయక్, ఎంపీడీవో రాఘవులు ఆంధ్రజ్యోతికి వివరించారు.



పనులను పర్యవేక్షిస్తున్న తాండూరు డీఎల్‌పీవో శంకర్ నాయక్









కనుల పండువగా ఎల్లమ్మ రథోత్సవం



పూజలందుకున్న కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ అమ్మవారు

- బోనమెత్తిన మహిళలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

తాండూరు రూరల్, జూన్ 7 : తాండూరు మండలం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర రథోత్సవం కనుల పండువగా సాగింది. రథోత్సవంలో భాగంగా కొత్లాపూర్‌లోని నవీన్‌రెడ్డి ఇంటి నుంచి అమ్మవారిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయం ప్రాంగణంలో సిడేతో పాటు రథంలో అమ్మవారిని ప్రతిష్ఠించగా, భక్తులు, యువకులు రథాన్ని లాగారు. ఈ సందర్భంగా తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ ఈవో శేఖర్‌గౌడ్, నాయకులు పలువురు సన్మానించారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. కాగా, రథోత్సవం సమయంలో భారీ వర్షం కురియడంతో భక్తులు రథాన్ని వానలోనే లాగారు. రథోత్సవం చూసేందుకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, నాగప్ప, బుడ్డెళ్లి సాయిలు, ఎంపీటీసీ రాజ్‌కుమార్, సందీప్‌రెడ్డి, జైదీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, గోపాల్, సురేష్, రాజేందర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఉత్తంచంద్, డాక్టర్ సంపత్‌కుమార్, బసిరెడ్డి, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.



బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు

పదవి ఉన్నా లేకున్నా ప్రజల్లోనే ఉంటా

- నమ్మకంతో ఓట్లేసిన ప్రజలకు, పనిచేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు
- ఫీనిక్స్ పక్షిలా పైకి లేద్దాం
- చేవెళ్ల మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి



వికారాబాద్/చేవెళ్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తాను ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని, పదవులు ఉన్నా లేకున్నా ప్రజల్లోనే ఉంటానని మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఓ ప్రత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఓటేసిన ప్రతీ ఒక్క ఓటరుకు, తన కోసం అహర్నిశలు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవ ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ విజయం సాధించేందుకు తీవ్రంగా శ్రమించామని తెలిపారు. అయితే ఎన్నికల ఫలితం మాత్రం తమ అంచనాలకు భిన్నంగా వచ్చిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో తన కోసం పనిచేసిన కార్యకర్తలందరికీ తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. రెండు, మూడు నెలల పాటు సాగిన ఎన్నికల పోరాటంలో చేవెళ్ల ప్రజలు ఇచ్చిన తీర్పును తాను నిండు మనస్సుతో గౌరవిస్తున్నట్లు తెలిపారు. ఎప్పటిలాగే అభివృద్ధి, అందుబాటులో ఉంటూ ప్రజాసేవలో భాగమవడమే కాకుండా ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు. ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ కార్యకర్తలు, తన శ్రేయోభిలాషులు ఎవరూ చింతించాల్సిన పనిలేదని, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేయాలని ఆయన గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో మరింత కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు ఫీనిక్స్ పక్షి మాదిరి కింద నుంచి పైకి వస్తామని ఆయన ధీమా వ్యక్తంచేశారు. ఇదిలా ఉంటే, కొన్ని వ్యక్తిగత పనుల కోసం తాను వారం రోజుల పాటు అందుబాటులో ఉండడం లేదని, వారం రోజుల తరువాత ప్రజాసేవలో నిమగ్నమవుతానని ఆయన తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల, జూన్ 7 : కాలుష్యం పెరిగిపోతుండటంతో భూతాపం పెరిగి ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రోజురోజుకూ అడవులు అంతరించపోవడంతో పర్యావరణానికి తీరని ముప్పు కల్గుతుందన్నారు. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి ప్రాణవాయువు తగ్గిపోతోందన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుంచి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 24వ తేదిన మండల పరిధిలోని ముడిమ్యాల్ అటవీ ప్రాంతంలో ప్రత్యేకంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించబోతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్ చామంతి శివరాజ్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు యాదిరెడ్డి, నరేందర్‌గౌడ్, ఇంద్రసేనవారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, రమేశ్, జబ్బార్, నర్సింలు, మోసిన్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కొడంగల్‌లో కురుస్తున్న వర్షం

మోస్తరు నుంచి భారీ వర్షం

- తాండూరు ఏఆర్ఎస్ ప్రాంతంలో 48.8 మిల్లీమీటర్లు నమోదు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

వికారాబాద్/పరిగి/తాండూరు/కొడంగల్ / బొంరాస్‌పేట్, జూన్7 : వికారాబాద్ జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లా తాండూరు ఏఆర్ఎస్ ప్రాంతంలో 48.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా బషీరాబాద్‌లో 42.3 మిల్లీమీటర్లు నమోదైంది. కొడంగల్, బొంరాస్‌పేట్ మండలాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లపై వరద ప్రవహించింది. గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పంట పొలాల్లో వర్షపు నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. పరిగి సబ్ డివిజన్‌లో ఈదురుగాలులతో కూడిన వర్షంతో చెట్లు విరిగిపడ్డాయి. పరిగితో పాటు, పలు గ్రామాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

అధిక ధరకు పత్తి విత్తనాలు విక్రయం

- షాపు యజమానిపై కేసు నమోదు

చేవెళ్ల, జూన్ 7: అధిక ధరలకు పత్తి విత్తనాలు అమ్ముతున్న ఫర్టిలైజర్ షాపు యాజమానిపై చేవెళ్ల పోలీస్‌లు కేసు నమోదు చేశారు. సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని ఎన్కెపల్లి చౌరస్తాలో ఉన్న శ్రీసాయి ఏజెన్సీ ఫర్టిలైజర్ దుకాణదారు ఈగ లక్ష్మారెడ్డి పత్తి విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.860కు బదులు.. అధిక ధర రూ.1200కు అమ్ముతున్నట్లు చేవెళ్ల ఏవో తులసికి సమాచారం అందింది. దాంతో ఆమె విచారణ చేయగా.. రైతులకు అధిక ధరకు విత్తనాలు అమ్మినట్లు తెలిసింది. ఈమేరకు ఏవో చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేయగా దాదాపు 120 పత్తి విత్తన ప్యాకెట్లు అధిక ధరకు రైతులకు అమ్మినట్లు బిల్లులతో పాటు ఆధారాలు లభించాయి. దాంతో షాపు యాజమాని ఈగ లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు. అధిక ధరకు విత్తనాలు, ఎరువులు, మందులు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మకాలు జరపాలని సూచించారు. నిబంధనలు ఉల్లఘిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.



స్వాధీనం చేసుకున్న పత్తి విత్తనాల ప్యాకెట్లు



హోటల్‌పై చినిగిపోయి ప్రమాదకరంగా వేళాడుతున్న బ్యానర్

చిరగిన బ్యానర్.. ప్రమాదానికి నిలువుటద్దం

మొయినాబాద్ రూరల్, జూన్ 7: ఇటీవల ఈదురుగాలులతో కురుస్తున్న వర్షాలకు రోడ్ల పక్కన భవనాలపై ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌కు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చిరిగిపోయి మృత్యుపాశాలుగా వేలాడుతున్నాయి. మండల పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తా వద్ద హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి ఉడిపి హోటల్ భవనంపై ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ చిరిగి వేలాడుతూ ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై ప్రయాణించే వాహనాదారులపై పడి ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే తొలగించాలని కోరుతున్నారు. ఇటీవల కాలంలో అనుమతులు లేకుండా రోడ్డు పక్కనే ఉన్న భవనాలపై ప్రమాదకరంగా భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారని ప్రయాణికులకు ప్రమాదకరంగా మారాయని.. వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. హిమాయత్ నగర్ గ్రామంలోని వైన్స్ దుకాణం ముందు ఓ ఇంటిపై భారీ ఎత్తు హోర్డింగ్ ఏర్పాటు చేస్తున్నారని దానివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని హిమాయత్‌నగర్ గ్రామ ప్రజలతో పాటు ఇటువైపు ప్రయాణించే వాహనాదారులు కోరుతున్నారు.



కొర్రమీనుకు భలే డిమాండ్

- కిలో రూ. 600 పలికిన ధర

వికారాబాద్, జూన్ 7 : మృగశిర కార్తె పురస్కరించుకుని వికారాబాద్ మార్కెట్‌లో చేపలు విక్రయాలు జోరందుకున్నాయి. కోట్‌పల్లి, సర్పన్‌పల్లి జుంటుపల్లి, నందివాగు ప్రాజెక్టుల నుంచి వచ్చిన చేపలను మార్కెట్‌లో అమ్మకానికి పెట్టారు. రవ్వ, బొచ్చ చేపలు కిలో రూ.160 పలకగా, కొర్రమీను రూ. 600లకు విక్రయించారు. శనివారం మృగశిర కార్తె కావడంతో ఆరోజు చేపలు తప్పకుండా తినాలనే అనవాయితీలో భాగంగా శుక్రవారమే ప్రజలు చేపలు కొనుగోలు చేశారు.



వికారాబాద్ మార్కెట్‌లోఅమ్మకానికి వచ్చిన చేపలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో విజయలక్ష్మి

వైద్యసేవల్లో నిర్లక్ష్యం తగదు

- డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

కేశంపేట, జూన్ 7: ఆసుపత్రికి వచ్చిన వారికి వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం తగదని షాద్‌నగర్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో విజయలక్ష్మి సూచించారు. ఈనెల 6న సాయంత్రం ఓ వ్యక్తి క్రిమిసంహారక మందు తాగడంతో కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తీసుకరాగా.. వైద్య సిబ్బంది లేక పోవడంతో షాద్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. అయితే, ఈ విషయం డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వోకు బాధితులు ఫిర్యాదు చేశారు. దాంతో శుక్రవారం కేశంపేట పీహెచ్‌సీలో విచారణ చేశారు. వైద్యసేవలు సకాలంలో అందకపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది విధులు మారే సమయంలో ఒకరు వచ్చిన తరువాతనే మరొకరు వెళ్లాలని సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఆమె గ్రామస్తులతో మాట్లాడారు ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్‌రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, శివాజీలు పాల్గొన్నారు.

డీఈఎల్‌ఈడీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూన్ 7: ప్రభుత్వ డైట్, ప్రైవేట్ డీఈఎల్‌ఈడీ కళాశాలలో ప్రవేశాలకు జూన్ 6వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని వికారాబాద్ డైట్ ప్రిన్సిపల్ కె.రామాచారి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-26 రెండు సంవత్సరాల డీఈఎల్ కోర్సు తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ మీడియంలో చేరడానికి ఆన్‌లైన్‌లో అప్లికేషన్లు సమర్పించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష జులై 10వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష కంప్యూటర్ బెస్ట్(ఆన్‌లైన్ మోడ్) ద్వారా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఇంటర్మీడియట్‌లో ఓసీ, బీసీ అభ్యర్థులు 50శాతం మార్కులతో, అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు 45శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని సూచించారు. అభ్యర్థులు సెప్టెంబర్ 1, 2024 నాటికి 17 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలను హెచ్‌హెచ్‌టీపీ:డీఈఈసీఈటీ.సీడీఎస్‌ఈ.తెలంగాణ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని డైట్ ప్రిన్సిపల్ తెలిపారు.

పార్లమెంటులో సమస్యలపై గళం విప్పుతా

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



కిరణ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల, జూన్ 7 : తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న సమస్యలపై పార్లమెంటులో గళం విప్పుతానని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి బుగ్గరాములు తదితరులు శుక్రవారం కిరణ్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కావలి శ్రీనివాస్, చీమల జంగయ్యయాదవ్, రమాకాంత్‌రెడ్డి, పెర్కమూర్తి, ఆనంగళ్ల యాదయ్య, మాసయ్యగౌడ్, రావుల బాషా, సాతిరి ఎల్లేష్, మార సురేష్, చిందం ఐలయ్య, రాజేష్, మార లక్ష్మన్, ముద్దం శంకర్, ప్రవీణ్ గౌడ్, సూర్యం, పెంటయ్య లక్ష్మన్, రిజిని అంతటి కృష్ణ తదితరులు ఉన్నారు.

వానాకాలం సాగు షురూ



బషీరాబాద్: నవాల్గలో పెసర సాగు చేస్తున్న రైతన్నలు

బషీరాబాద్, జూన్ 7: నాలుగైదు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు వానాకాలం సాగు పనుల్లో బిజీగా ఉన్నారు. ఇప్పటికే పొలాల్లో దుక్కులు చేసుకున్న చిన్న, సన్న కారు రైతులు ఎడ్లతో విత్తనాలు వేస్తున్నారు. పెద్ద రైతులు ట్రాక్టర్లతో పెసర, మినుము, పత్తివిత్తనాలు విత్తుతున్నారు. గ్రామాల్లో ప్రస్తుతం ఎక్కడ చూసినా రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. వానాకాలం సీజన్‌లో మండలంలో సుమారు 20వేల ఎకరాలకు పైగా వివిధ రకాల పంటలు సాగు చేయనున్నారు. పత్తి 10వేల ఎకరాల్లో వేస్తారని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

విత్తనాలు విత్తడంలో రైతన్నలు బిజీ బిజీ

పూడూరు: కురిసిన మోస్తరు వర్షంతో రైతులు పొలం పనులకు సిద్ధమయ్యారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రైతులు తమతమ పొలాల్లో బిజీబిజీగా మారారు. మూడురోజులుగా పలు చోట్ల వర్షాలు కురుస్తుండటంతో రైతులు పులకరించిపోతున్నారు. విత్తుకునేందుకు సిద్ధంగా ఉంచిన పొలాల్లో విత్తనాలు విత్తే పనుల్లో రైతులు బిజీ బిజీగా గడుపుతున్నారు.



పూడూరు: తిర్మలాపూర్‌లో విత్తనాలు వేస్తున్న రైతు కూలీలు

పార్కు స్థలాన్ని కాపాడాలి

ఘట్‌కేసర్, జూన్ 7: పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లోని శ్రీవేంకటేశ్వర హౌజింగ్ కాలనీలోని 8వేల చదరపు గజాల పార్కుస్థలాన్ని కాపాడాలని మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, కౌన్సిలర్లు, నాయకులు అన్నారు. పోచారం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కోట్ల రూపాయాల విలువ గల పార్కు స్థలం చుట్టూ రూ.20లక్షలు వెచ్చించి నిర్మించిన కంచెను ధ్వంసం చేసిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఐదు రోజులకు కేసు నమోదు చేశారని తెలిపారు. కబ్జాకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేయకపోడంతో తరచూ యంత్రాలు తీసుకువచ్చి మున్సిపాలిటీ స్థలంలో పనులు చేపట్టేందుకు యత్నిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి మున్సిపాలిటీ ఆస్తిని ధ్వంసం చేసిన పోలాగోని రాజేందర్‌గౌడ్, రేజింతల విక్రంకుమార్‌లను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, సుర్వీరవీందర్‌గౌడ్, నాయకులు నర్రి కాశయ్య, నల్లవెల్లి శేఖర్, సామల బుచ్చిరెడ్డి, అకిటి బాల్‌రెడ్డి, బైర ఐలయ్య, మోటుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

పరిగి,జూన్ 7: విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే అన్ని రంగాల్లో రాణించాలని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, పరిగి జడ్పీటీసీ బి.హరిప్రియప్రవీణ్‌రెడ్డిలు అన్నారు. అభినయ కూచిపూడి డ్యాన్స్ అకాడమి 45రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో వారు ప్రతిభావంతులైన చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నార్మాక్స్ మాజీ డైరెక్టర్ బి.ప్రవీణ్‌రెడ్డి, డాన్స్ కోచ్ కవిత తదితరులు పాల్గొన్నారు.

డీఎఫ్ఆర్సీ కమిటీ పనిచేస్తుందా?

తాండూరు, జూన్ 7: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులు దోపిడికి పాల్పడుతున్నా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ ఆరోపించారు. డీఎఫ్ఆర్సీ డిస్ట్రిక్ ఫీజు రెగ్యులేటింగ్ కమిటీ అనుమతి తీసుకున్న తర్వాతే ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ ఫీజులను పెంచుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా, మోసపూరిత ప్రకటనలతో ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ స్కూల్‌లో డ్రెస్సులు, పుస్తకాలు, నోట్‌బుక్స్ సంబంధించిన స్కూల్లో అమ్మకూడదని ఉన్నప్పటికీ ప్రైవేట్ స్కూల్‌లో అమ్మకాలున్నాయని అధికారులు స్పందించాలని కోరారు.

ఆర్మీకి ఎంపికైన అంతారం యువకుడు



అంతారంలో హరీష్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో, ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు

తాండూరు రూరల్, జూన్ 7: మండలంలోని అంతారం గ్రామానికి చెందిన కురవ లింగం కుమారుడు కురువ హరీష్ ఆర్మీలో ఉద్యోగం పొందాడు. హరీష్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో చదివాడు. ఆర్మీ ఉద్యోగం సాధించి ఇటీవల భారత రక్షణ దళంలో చేరాడు. ఈ సందర్భంగా శుక్రవారం అంతారంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీలత ఆధ్వర్యంలో హరీష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం అభినందనీయం



డ్రైనేజీని ప్రారంభిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూన్ 7: అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం అభినందనీయమని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్ మల్లిఖార్జునగర్ కాలనీలో శుక్రవారం రూ.11.50లక్షల వ్యయంతో దాతల ఆర్థిక సాయంతో నిర్మించిన 750మీటర్ల భూగర్భ డ్రైనేజీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కౌన్సిలర్ నర్రి ధనలక్ష్మి కాశయ్య, దాతలు వేణు, కృష్ణాగౌడ్, రామకృష్ణ, రమేష్, నాయకులు రామకృష్ణాచారి, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

'భగీరథ' కనెక్షన్‌ల సర్వేకు సహకరించాలి

దోమ, జూన్ 7: మిషన్ భగీరథ తాగునీటి కుళాయి కనెక్షన్ సర్వేకు ప్రతీఒక్కరు సహకరించాలని ఎంపీడీవో మహేశ్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం కలెక్టర్ ఆదేశానుసారం ఇంటింటి సర్వేతో కుళాయి కనెక్షన్ ఉందా లేదా అనే దానిపై సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా ఇంటి యజమాని ఆధార్, మొబైల్ నెంబర్‌లు, ఫొటో, కుళాయి కనెక్షన్ ఫొటో సేకరించారు.

మానవత్వం చాటుకున్న మాజీ సర్పంచ్

పూడూరు, జూన్ 7: మండలంలోని రాకంచర్ల మాజీ సర్పంచ్ పెంటన్న మానవత్వాన్ని చాటుకున్నారు. రాకంచర్ల గేటు సమీపంలో ఓబైక్ అదుపుతప్పడంతో మహిళకు, బాలుడికి గాయాలయ్యాయి. అదే సమయంలో అటువైపు నుంచి కారులో వస్తున్న రాకంచర్ల మాజీ సర్పంచ్ పెంటయ్య, కారును ఆపి బాధితులను స్థానికుల సాయంతోఒ తన కారులో ఎక్కించి చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో స్థానికులు పెంటయ్యను అభినందించారు.

ఇలాగైతే వ్యాధులు ప్రబలవా?



బషీరాబాద్, జూన్ 7: నవాల్గలో గిరిజన తండాలకు వెళ్లే మార్గం ప్రధాన రోడ్డుపైకి మురుగు, చెత్తాచెదారం చేరి సీసీరోడ్డు అపరిశుభ్రంగా మారింది. ఇళ్ల సమీపంలోనే ఈ పరిస్థితి ఉండటంతో స్థానికులతో పాటు తండాలకు వెళ్లే ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నెంబర్ ప్లేట్లు మారిస్తే కఠిన చర్యలు

మేడ్చల్ టౌన్, జూన్ 7: నెంబర్ ప్లేట్లు మార్చి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నెంబర్ ప్లేట్లు మార్చి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వాహనం రిజిస్ట్రేషన్ సమయంలో కేటాయించిన నెంబర్‌ను మార్చడం, లేక అర్థమవకుండా రాయించడం చట్టరీత్యా నేరమన్నారు. వాహనాల నెంబర్లు మార్చితే అలాంటి వాహనాలను సీజ్ చేయటంతో పాటు సదరు వాహన యజమానులపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలని కోరారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, హెల్మెట్ ధరించకున్నా, రాంగ్ రూట్‌లో వాహనం నడిపినా, నిషేధిత ప్రాంతాల్లో వాహనాలను పార్కింగ్ చేసినా, శబ్ద కాలుష్యాన్ని పెంపొందించే విధంగా సైలెన్సర్లను అమర్చినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నందున చాలా మంది రాంగ్‌రూట్‌లో రహదారిపై ప్రయాణించి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. యూటర్న్‌లు ఏర్పాటు చేసిన ప్రాంతం నుంచి రోడ్డు దాటాలని వాహన దారులకు సూచించారు. ప్రతీ వాహన దారుడు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని ఏసీపీ కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.



వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఏసీపీ

ప్రజాపరిపాలనలో అందరి సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

ధారూరు, జూన్ 7: మండలంలో ప్రజా పరిపాలనకు ప్రజాప్రతినిధులు, అధికారులు అందరి సహకారం ఉందని ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ పాలకవర్గ చివర మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమవేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ వచ్చే నెలలో తన పదవీకాలం పూర్తవుతుందని పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులకు అధికారులు తోడ్పాటునందించాలని ఆమె కోరారు.

ఎజెండా అంశాలపై చర్చ

ఎజెండా అంశాలలోని పలు శాఖలకు సంబంధించిన అంశాలపై సభ్యులు చర్చించారు. విద్యాశాఖ అంశాలు చర్చకు రాగా ఇన్‌చార్జి ఎంఈవో బాబుసింగ్ సమావేశానికి గైర్హాజరవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో జరిగిన సమావేశాలకూ ఆయన హాజరు కాలేదని సభ దృష్టికి తెచ్చారు. మండలంలో 35 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద మరమ్మతు పనులకు రూ.2.58కోట్లు మంజూరైనట్లు ఎంపీడీవో నర్సింహులు తెలిపారు. వ్యవసాయ పొలాలలో వేలాడుతున్న విద్యుత్‌తీగలను, వంగిపోయిన విద్యుత్ స్తంభాలను సరి చేయాలని సభ్యులు, ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తగా ఉండాలని, నకిలీ విత్తనాలు కొనుగోలు చేయరాదని వికారాబాద్ ఏడీఏ వినోద్ కుమార్ తెలిపారు. పత్తివిత్తనాలను ఎంఆర్‌పీ కంటే అధికధరలకు విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలని ఆయన రైతులకు సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు పి.బసప్ప, ఎంపీటీసీలు రవీందర్, శ్రీనివాస్, ఎం.శ్వేతారెడ్డి, నర్సమ్మ పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన

పెద్దేముల్, జూన్ 7: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన ఉంటుందని జిల్లా విద్యాధికారి రేణుకా దేవి పేర్కొన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య, జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రవీంద్రనాథ్, అంగన్‌వాడీ టీచర్స్ భారతి, లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రేణుకా దేవి

తాండూరు: ప్రైవేటు స్కూళ్లలో కంటే సర్కారు బడుల్లోని పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని తాండూరు మున్సిపల్ గాంధీ నగర్ కౌన్సిలర్ సంగీత అజయ్ సింగ్ ఠాకూర్ సూచించారు. వార్డులో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు పుస్తకాలు, బ్యాగులు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, డ్రెసెలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ నగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మాదవి, పాఠశాల చైర్మన్ ఓబి లలిత, ఉపాధ్యాయురాలు రాణి పాల్గొన్నారు.

దోమ: మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని పెద్ద తండా, బ్రహ్మణ్‌పల్లి, పీర్లగుట్ట ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమంలో ఎంఈవో హరిశ్చందర్ పాల్గొని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లాల్యానాయక్, ఉపాధ్యాయులు గోపాల్, భీమ్లానాయక్, ఎస్ఎంసీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలోని చించల్‌పేట్ గ్రామంలో జడ్పీటీసీ కాలే జయమ్మ ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి గోపాల్, పాఠశాల హెచ్‌ఎం ఎల్.పాండు, మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు

వికారాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి)/వికారాబాద్: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను శుక్రవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, కొప్పుల మహేష్‌రెడ్డి, యువ నేత కార్తీక్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసారు. ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో కేసీఆర్‌ను కలిసిన వారు లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై చర్చించినట్లు తెలిసింది. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ఓటమికి దారి తీసిన కారణాలను విశ్లేషించినట్లు సమాచారం. ఈ సమయంలో వీరితో పాటు మహబూబాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కూడా ఉన్నారు.



మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ మంత్రులు

శామీర్‌పేట: మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భిక్షపతిగౌడ్, తదితర నాయకులు ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

కీసర రూరల్, జూన్ 7 : గడువు లోగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. నాగారం మున్సిపాలిటీ లోటస్ కాలనీ నుంచి మోడీ అపార్ట్‌మెంట్స్ వరకు రూ.8కోట్లతో నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం అయ్యే నాటి కాలువ నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు అన్నంరాజ్ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



బాక్స్‌డ్రైన్ పనులను పరిశీలిస్తున్న చంద్రారెడ్డి

సంక్షిప్తంగా..

- **మేడ్చల్ టౌన్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సాయిగీత ఆశ్రమంలో మృగశిర కార్తె సందర్భంగా శనివారం అస్తమా రోగులకు ఉచితంగా ఆస్తమా మందు పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
- **శామీర్‌పేట:** తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 10న సోమవారం నుంచి తిరిగి ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించలేదని ఆయన చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తిరిగి ఈ నెల 10వ తేదీ నుంచి మున్సిపల్ కార్యాలయంలో యథావిధిగా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
- **ధారూరు:** మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అధిక రక్తపోటు, మధుమేహం వ్యాధులపై స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపులో ఎంపీపీ విజయలక్ష్మి పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, ఎంపీడీవో నర్సింహులు పాల్గొన్నారు.
- **కొడంగల్:** కొడంగల్ మున్సిపాలిటీ అభివృద్ధిపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, వార్డు కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యుల సమక్షంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.
- **నవాబుపేట:** మైతాప్‌ఖాన్‌గూడలో సర్వే నెం.402లో గల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చదును చేసి ఆక్రమిస్తున్నాడని కార్యదర్శి నితిన్‌కుమార్‌కుశుక్రవారం నవాబుపేట తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

నేడు తాండూరులో ఫుడ్ మేళా

తాండూరు, జూన్ 7: తాండూరు ఆర్య వైశ్య సంఘం సౌజన్యంతో వాసవి మహిళ సంఘం ఆధ్వర్యంలో నేడు ఫుడ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం అధ్యక్షురాలు కోట్రిక నాగలక్ష్మీ శ్రీకాంత్ తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి పట్టణంలోని ఆర్యవైశ్య ఓపెన్ ఆడిటోరియంలో ఫుడ్‌మేళా ప్రారంభముతుందని తెలిపారు. ఫుడ్ మేళ ఎంట్రీ ఫీజు పిల్లలకు రూ. 10లు, పెద్దలకు రూ. 20లు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేళాను విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్, జూన్ 7: వికారాబాద్ జిల్లాలో గల దివ్యాంగులకు సదరం శిబిరానికి సంబంధించి శుక్రవారం ఆన్‌లైన్‌లో స్లాట్స్ పెట్టినట్లు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరాలు ఈ నెల 11, 13, 21, 27, 29 తేదీల్లో తాండూర్ ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగవైకల్యం, బుద్ధి మాంధ్యత, చెవుడు, మూగ గల దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా ఈ నెల 10, 11, 18, 26 తేదీల్లో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించే శిబిరాలకు దివ్యాంగులు హాజరు కావాలని తెలిపారు. సదరం సర్టిఫికేట్ ఇది వరకే పొంది సర్టిఫికేట్ కాల పరిమితి అయిపోయిన వారితో పాటు కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న వారు హాజరు కావాలన్నారు. మొత్తం 590 స్లాట్స్ అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



నిందితుడు రమేశ్(ఫైల్)

పరిగి, జూన్ 7: ఓ మహిళ హత్య కేసులో నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. ఈ కేసుకు సంబంధించి జిల్లా న్యాయాధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తీర్పుఇచ్చారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పరిగి మున్సిపల్ పరిధిలోని తుంకులగడ్డలో బొంపల్లి యాదయ్య, శానమ్మ దంపతులు నివాసముంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన బిచ్చపు రమేశ్, శానమ్మతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. 2020 ఫిబ్రవరి 27న శానమ్మ ఇంటికి తన భర్త లేని సమయంలో రమేశ్ వెళ్లాడు. అయితే రమేశ్, శానమ్మ గొడవ పడగా మాటామాటా పెరిగి రమేశ్ రాడ్‌తో శానమ్మ తలపై కొట్టి హత్యచేశాడు. అప్పట్లో విచారణ అధికారులు డీకే లక్ష్మీరెడ్డి, సీహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదుచేపట్టి దర్యాప్తు నివేదికను న్యాయస్థానానికి సమర్పించారు. కేసులో న్యాయస్థానంలో పూర్వపరాలు పరిశీలించిన న్యాయాధికారి నిందితుడికి జీవిత ఖైదీతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు పరిగి పోలీసులు తెలిపారు.

శివాలయంలో చోరీ

- 4 కిలోల వెండి అభరణాలు, గ్రాము బంగారు పుస్తె అపహరణ



అంకుశాపూర్ శివాలయంలో చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న సీఐ సైదులు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 7: శివాలయంలోకి గుర్తుతెలియని దుండగలు ప్రవేశించి వెండి అభరణాలను అపహరించుకెళ్లారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మండలం, అంకుశాపూర్‌లోని శ్రీశ్రీశ్రీ భవానీ శంకర శివ పంచాయతన స్పటిక లింగేశ్వరాలయంలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు గేటు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఆలయ గర్భగుడి గ్రిల్‌కు ఉన్న తాళాన్ని పగులగొట్టి వెండి ఆభరణాలైన అమ్మవారి కిరీటం, నాగపడగ, కవచంతో పాటు గ్రాము బంగారుపుస్తెను అపహరించుకెళ్లారు. ఉదయం భక్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. వెండి అభరణాలు దాదాపు 4 కిలోల వరకు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సీఐ సైదులు ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హనుమాన్ ఆలయంలో..

మూడుచింతలపల్లి, జూన్ 7: హనుమాన్ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లాల్‌గడి మలక్‌పేట్ గ్రామపరిధిలోని హనుమాన్ ఆలయంలో గురువారం రాత్రి కొందరు గుర్తుతెలియని దుండగులు ఆలయంలోకి చొరబడి సుమారు కిలో విలువ గల ఆంజనేయుడి విగ్రహ కవచాన్ని దొంగలించినట్లు గుడి అర్చకులు మనోహర్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక కిడ్నాప్‌నకు యత్నం.. నిందితుడికి దేహశుద్ధి

- పోలీసులకు అప్పగింత



అంజిలయ్యకు దేహశుద్ధి చేస్తున్న గ్రామస్థులు

బొంరాస్‌పేట్, జూన్ 7: ఆరేళ్ల బాలిక కిడ్నాప్‌నకు యత్నించిన వ్యక్తిని గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన బొంరాస్‌పేట్ మండలంలోని రేగడిమైలారం గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన ఓ ఆరేళ్ల బాలిక గురువారం రాత్రి బహిర్భూమికి వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకుండా పోయింది. అదే గ్రామానికి చెందిన కడంపల్లి అంజిలయ్య బాలికను గ్రామ శివారులోని పొదల్లోకి తీసుకెళ్లాడు. బాలిక ఆచూకీ కోసం తల్లిదండ్రులు, గ్రామస్థులు వెతుకుతుండగా గ్రామ శివారులోని ముళ్ల పొదల్లో కడంపల్లి అంజిలయ్య దగ్గర ఉండటంతో గమనించిన గ్రామస్థులు పట్టుకున్నారు. అంజిలయ్యను ఆరా తీయగా సరైన సమాధానం చెప్పకపోవడంతో దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై బొంరాస్‌పేట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 7: రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు అదుపులోకి తీసుకుని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి-భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం, చీకటిమామిడికి చెందిన దీరావత్ ప్రశాంత్(20) ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో తక్కువ ధరకు రేషన్‌బియ్యం కొనుగోలు చేసి కోళ్లఫారం, ఇటుకబట్టీల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తుంటాడు. కాగా ఎదులాబాద్‌లో శుక్రవారం ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలుచేసి ఓ ఇంట్లో నిల్వచేశాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు నిల్వచేసిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొ దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



బొప్పిడి యాదిరెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 7: పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడి జాడ కనిపించడంలేదని కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. సీఐ రాజు వర్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొర్రెముల, వెంకటాద్రి కాల నీలో నివాసం ఉండే బొప్పిడి యాదిరెడ్డి(76) ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్తున్నానని చెప్పి సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో అతడి కుటుంబసభ్యులు పరిసరాలు తిరిగి తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో పోచారం ఐటీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదృశ్యమైన యాదిరెడ్డి దోతి, తెల్లని చొక్కా ధరించినట్లు తెలిపారు. యాదిరెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'అనురాగ్'లో పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రారంభం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 7: మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో పైథాన్ ప్రోగ్రామింగ్‌పై అంతర్జాతీయ ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రచయిత రీమా తరేజ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ పైథాన్ ప్రోగ్రామింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ డీన్ డాక్టర్ విష్ణుమూర్తి, మధు, శివప్రసాద్ పాల్గొన్నారు.

తాండూరులో పైలెట్ రోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి జన్మదిన సందర్భంగా రక్తదానం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

తాండూరు, జూన్ 7: మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రోహిత్‌రెడ్డి నివాసంలో కార్యకర్తలు కేక్ కట్‌చేశారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు రోహిత్ అన్న యువసేన సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజు గౌడ్, నాయకులు శ్రీనివాసచారి, నహీం, విజయ్ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యాలాల: తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించి యాలాల మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జుంటుపల్లి రామస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు.